
T.T.D. Religious Publications



Published by **Sri M.G. GOPAL,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

# శ్రీ కోదండరామస్వామి ఆలయం
## తిరుపతి



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

**శ్రీ కోదండరామస్వామి ఆలయం, తిరుపతి**

*రచన*
**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**

**ప్రథమ ముద్రణ :** 2014
**ప్రతులు :** 20,000
**వెల :** అమూల్యం

*ప్రచురణ*

**శ్రీ ఎమ్.జి.గోపాల్,** ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి

**డి.టి.పి**

ఎడిటర్–ఇన్–చీఫ్ కార్యాలయం,
టి.టి.డి, తిరుపతి.

**ముద్రణ**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి–517 507.

# శ్రీ కోదండరామస్వామి ఆలయం
# తిరుపతి

*రచన*
**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**
**తిరుపతి**

*ప్రచురణ*
**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**2014**

## ముందుమాట

తిరుమల తిరుపతి దేవస్థానంవారి పర్యవేక్షణలో శ్రీరాముని ఆలయాలు రెండు ఉన్నాయి. ఒకటి తిరుపతిలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయం. రెండవది వాయల్పాడు అని పిలువబడే వాల్మీకిపురంలోని శ్రీపట్టాభిరామస్వామి ఆలయం. ఈ రెండు ఆలయాల్లోని శ్రీరామచంద్రుని మూలమూర్తులు జాంబవంతులవారి ప్రతిష్ఠగా చెప్పబడుతున్నాయి.

వేంకటాచలక్షేత్రానికి, శ్రీరామచంద్రునికి చాల దగ్గరి సంబంధం వుంది. ప్రతిరోజు శ్రీవేంకటాచలపతి "కౌసల్యా సుప్రజా రామ..." అని సుప్రభాతవేళ మేల్కొల్పులు పాడించుకుంటున్నాడు. తిరుపతి శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో కూడ తిరుమల శ్రీవారి సుప్రభాత స్తోత్రం పఠించడం విశేషం. ఆలయంలో ప్రత్యేకంగా 'రాములవారి మేడ' అనే 'అర' చోటుచేసుకోవడమే గాక అందులో శ్రీసీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీకోదండరాముని ఉత్సవమూర్తులు కొలువై ఉండడం కూడ అద్భుతమైన అంశం.

తి.తి.దేవస్థానంలోని అన్ని ఆలయాలను అభివృద్ధి పరచడంతోపాటు, వాటి స్థలపురాణాలను, ఆలయ విశేషాలను, సేవలను సంక్షిప్తంగా భక్తులకు తెలియచేయాలని తి.తి.దేవస్థానం సంకల్పించింది. అందులో భాగంగా కల్యాణరామునిగా, ఇష్టార్థరామునిగా భక్తలోకంలో ప్రతీతినందిన తిరుపతి శ్రీకోదండరామ స్వామివారి ఆలయచరిత్రను, సంగ్రహంగా రచించిన శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యంగారికి అభినందనలు. ఈ చిన్ని పుస్తకాన్ని తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ప్రసాదంగా స్వీకరించి భక్తులు ధన్యులు కావాలనీ ఆకాంక్షిస్తూ...

*సదా శ్రీవారి సేవలో...*

ఎం.జి.గోపాల్

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

## శ్రీ కోదండరామస్వామి ఆలయం - తిరుపతి

**సీతాయా వామభాగే చ లక్ష్మణస్య చ దక్షిణే**

**తన్మధ్యే రాఘవం వందే ధనుర్బాణధరం హరిమ్.**

దివ్యమైన భవ్యమైన తిరుపతి పట్టణం నడుమభాగాన ఇష్టార్థులపాలిటి పెన్నిధిగా వెలసిన పరమపావనమైన దివ్య ఆలయం శ్రీకోదండరామస్వామి ఆలయం!

ఈ దేవాలయంలోని గర్భగృహంలో స్థానక భంగిమ (నిలిచివున్న) లో దర్శనమిస్తున్న కల్యాణరాముడు శ్రీ కోదండరాముడు! కుడివైపున సాక్షాత్తు శ్రీమహాలక్ష్మీ స్వరూపురాలైన సీతాదేవి! మరోప్రక్కన అనగా ఎడమవైపున శ్రీలక్ష్మణస్వామి వేంచేసివుండగా వీరిరువురి మధ్యలో ధనుర్బాణాలతో విరాజిల్లుతూవున్న సాక్షాతు శ్రీమన్నారాయణుడైన శ్రీకోదండరాముడికి నమస్కారాలు.

నిలువెత్తు దివ్యమంగళమూర్తిగా దర్శనమిస్తూ భక్తులను ఆనందపరుస్తున్న సీతాలక్ష్మణసమేత శ్రీరామచంద్రమూర్తి!



ఇంకెక్కడా కానరాని సుందర దృశ్యం!

శ్రీరామచంద్రమూర్తికి కుడివైపున కొలువైవున్న సీతమ్మవారి దర్శనం సర్వార్థ సిద్ధిప్రదం! సర్వ శ్రేయోదాయకం!

ఇంతటి మహిమగల శ్రీకోదండరామస్వామివారిని శ్రీరామభక్తుడైన జాంబవంతులవారు ప్రతిష్ఠించినారని స్థలపురాణం చెబుతోంది.

### స్థలపురాణం

తిరుమలక్షేత్రంలోని, శ్రీనివాసభగవానునికీ, శ్రీరామ చంద్రునికీ యుగయుగాలుగా విడదీయలేని, విడదీయగరాని ఒక అవినాభావ సంబంధం చోటు చేసుకొంది.

అదేమిటంటే! శ్రీ వేంకటపతి ఇచ్చిన వరంవల్లే శ్రీరాముడు అవతరించాడట! ఆశ్చర్యంగా ఉంది కదూ! ఎంత అబ్బురమైనా ఈ మాట మాత్రం నిజం!

వేంకటపతి వరం ఎవరి కిచ్చాడు? ఎప్పుడిచ్చాడు? ఎప్పటి శ్రీరామచంద్రుడు! మరెప్పటి వేంకటాచలపతి! మరి ఆ వైనమేమిటో చెప్పుకుందాం.



### దేవతలు విష్ణువును వెదకడం

ఇది త్రేతాయుగం నాటి మాట!

అప్పట్లో రావణ కుంభకర్ణులు పెడుతున్నబాధలవల్ల లోకాలు అన్నీ తల్లడిల్లాయి. వారు పెట్టేబాధలు అన్నీ ఇన్నీ కాదు. ఒకటా! రెండా! ఒక లోకంలోనా! ఏమన్నానా. అటు భూలోకం, ఇటు స్వర్గ లోకం. ఈ మధ్యలో ఎన్నిచోట్లో! ఇలా అన్ని లోకాల్లోను వారి ఆగడాలు మితిమీరినందువల్ల ఒక్కుమ్మడిగా బ్రహ్మాది దేవతలు, ఋషులు అందరూ కలిసి వైకుంఠానికి వెళ్ళారు.

ఆ వైకుంఠంలో శ్రీమన్నారాయణుడు ఉంటేగా చెప్పుకోవడానికి! ఎక్కడికో వెళ్లాడు. ఎక్కడికి వెళ్లాడో ఎవరికీ తెలియదు. దేవతలందరూ దివ్యదృష్టితో పరికించి చూచారు. వెదికి వెదికి వేసారినారు. తప్ప ఎక్కడా ఏ లోకంలోనూ శ్రీనివాసభగవానుని జాడే కన్పడలేదు పాపం! దిగాలుమన్నారు దేవతాపరివారమంతా! కాని వాళ్లందరి అదృష్టం బాగున్నట్లుంది.



ఇంతలో వాళ్లకు నారదుడు కన్పడ్డాడు.

నారదమహర్షీ! ఈ బాధలనుంచి గట్టెక్కే ఉపాయం చెప్పండి అంటూ ప్రార్థిస్తూ వాళ్లందరూ లోకాలన్నింటి బాధలను వెళ్లబోసుకొన్నారు.

నారాయణ! నారాయణ! అంటూ తలను ఆడిస్తూ నారదుడు ఇలా అన్నాడు.

ఓ మహనీయులారా! ప్రస్తుతం ఈ వైకుంఠపురంలో శ్రీమహావిష్ణువు లేడు. మీరు అందరూ భూలోకం వెళ్లండి. అక్కడ వేంకటాచలం అనే దివ్యమైన భవ్యమైన క్షేత్రం ఉంది. ఆ పుణ్యగిరులలో సాక్షాత్తు వైకుంఠవాసుడు లీలా మానుషరూపుడై సంచరిస్తున్నాడు. అక్కడికి వెళ్లి, మీరు అందరూ, ఎవరికి తోచినట్లుగా వారు తపస్సులు చెయ్యండి! అలా సాధనలు చేస్తూ ఓపికతో నిరీక్షించండి. అప్పుడు మీకు ఆ స్వామివారు దర్శనం ఇవ్వవచ్చు. అంతే. నారాయణ! నారాయణ! అంటూ తన దారిన తాను వెళ్లాడు మహర్షి నారదుడు.

దేవతలు అందరూ వేంకటాచలక్షేత్రం చేరుకున్నారు. శ్రీనివాసభగవానుని దర్శనంకోసం తపస్సులు ప్రారంభించారు.

**దశరథుని వేంకటాచల యాత్ర**

సరిగ్గా అయోధ్యానగరాన్ని దశరథచక్రవర్తి పాలిస్తున్న రోజులు అవి! దశరథుడంటే కేవలం అయోధ్యకు మాత్రమే రాజు కాదు. కేవలం అష్టదిక్కుల్లోనే గాక, అటు ఊర్ధ్వలోకాల్లోను ఇటు అధోలోకాల్లోను, రథాన్ని నడిపించగల సార్థక నామధేయుడు దశరథుడు. ఇలా స్వేచ్ఛగా అన్నిలోకాల్లో రథాన్ని నడపించగల చక్రవర్తి! దేవదానవయుద్ధాల్లో దేవతలకు విజయాన్ని చేకూర్చిపెట్టి ఎన్నో వరాల్ని కూడా పొందిన మహావీరుడుకూడా!

ఇలా 60 వేలఏండ్లపాటు రాజ్యాన్ని సర్వశోభాయ మానంగా పాలించాడు. కాని అంతటి చక్రవర్తికీ ఒక కొరత ఉంది!

దశరథుడు కూడ ఎంత కాలానికి సంతానం కలగలేదన్న తీరని బాధతో తన వేదనను గురువు వశిష్ఠులవారికి విన్నవిస్తూ పరితపించి పోయాడు.



పరిష్కారమార్గం చెప్పండి అంటూ నిరాశా నిస్పృహలకు లోనై కృంగి పోయాడు దశరథ మహారాజు.

వశిష్ఠమహర్షివరేణ్యులు అనేక విధాలుగా ఆలోచించి చక్రవర్తీ! ఏ మాత్రం చింతించ వద్దు. వింధ్యపర్వతానికి ఆవల సువర్ణముఖరీనదీ తీరంలో వేంకటాచలక్షేత్రం ఉంది. ఆ సప్తగిరుల దివ్యసానువుల్లో సాక్షాత్తు వైకుంఠవాసుడు శ్రీమహాలక్ష్మీ సమేతంగా లీలామానుష రూపంతో విహరిస్తుంటాడు. కేవలం తప స్సంపన్నులకూ పరమయోగులకు, సాధకులకు మాత్రమే ప్రత్యక్షంగా దర్శనమిస్తాడు. కోరిన వరాలను ప్రసాదిస్తాడు.

మహారాజా! అలాంటి దివ్యమైన వేంకటగిరులకు వెంటనే యాత్రగా వెళ్లు! అచటవున్న పరమపావనమైన స్వామిపుష్కరిణీ తీర్థజలాల్లో స్నానం చేస్తూ, కొంతకాలం పాటు పుత్రార్థివై సాధన చెయ్యి. నీ కోరిక తప్పక నెరవేరుతుంది. నీవు వేంకటాచలం వెళ్లిరా! అంటు ఆశీర్వదించి పంపాడు వశిష్ఠమహర్షి. వెంటనే సంతానార్థియైన దశరథుడు వేంకటాచలక్షేత్రం చేరుకొన్నాడు.



ఆ పర్వతసానువులు పచ్చని చెట్లతో, పూ పొదరిల్లతో, పరిమళ ఝరులతో అందంగా ఆకర్షణీయంగా గోచరించాయి. దశరథుడు వింత అనుభూతికి లోనయ్యాడు. వీటిన్నిటితోపాటు సర్వత్రా ఒక ఆధ్యాత్మిక చైతన్యంతో ప్రకాశిస్తున్న ఆ పర్వతరాజాన్ని వీక్షిస్తూ దివ్యానందంతో పులకించిపోయాడు అయోధ్యా చక్రవర్తి! దశరథమహారాజు.

అప్పటికే ఆ పుణ్యప్రదేశాల్లో బ్రహ్మేంద్రాది దేవతలు, అనేకమంది మునులు, యోగులు... ఇలా ఎందరో తపస్సు చేస్తుండడం చూచి ఆశ్చర్యపోయాడు దశరథుడు ఆనందపడ్డాడు. తానూ తపస్సును ప్రారంభించాడు. ఇలా కొంతకాలం గడిచింది.

ఒకరోజు శుభోదయవేళ! అందరికీ ఆశ్చర్యం కలిగేట్లుగా ‘ఓం’ అనే గంభీరమైన నాదం పెద్దగా వినపడుతుండగా దివ్యతేజస్సుతో కూడిన అద్భుతమైన బంగారువిమానం ప్రత్యక్షమయింది. ఇంతటి అందమైన బంగారువిమానాన్ని ఇంతవరకు ఎవరూ చూడలేదు.



చూచివుండరు కూడ. వింత వింత తేజస్సులతో ప్రకాశిస్తున్న ఆ విమానం అంతర్భాగంమధ్యలో పురుషోత్తముడైన భగవానుడు దర్శనమిచ్చాడు. శంఖచక్రాలు ధరించాడు. ఇంకా నందకఖడ్గంతో పాటు గదను, ధనుస్సును ధరించాడు. ఈ పంచాయుధాలతో పాటు అనేకమైన దివ్యాభరణాలను రత్నకిరీటాన్ని ధరించాడు. వక్షఃస్థలంలో వ్యూహలక్ష్మీదేవితో పాటు భూనీళాదేవులతోపాటు కన్నుల పండువుగా దేదీప్యమానంగా దర్శనమిచ్చాడు పరంధాముడు.

రావణకుంభకర్ణాదులవల్ల కలుగుతున్న బాధలను ఏకరువు పెడుతూ, వాళ్ల నుండి లోకాలను రక్షించవలసిందని అనేక విధాలుగా ప్రాధేయపడుతూ స్వామివారిని స్తుతించారు బ్రహ్మాదిదేవతలు.

దశరథమహారాజుకూడా తనకు సంతానాన్ని ప్రసాదించ వలసిందని శ్రీనివాసుని వేడుకొన్నాడు. శ్రీహరి అందరివైపు కరుణతో నిండిన చూపులతో వీక్షిస్తూ, ప్రత్యేకంగా దశరథునితో ఇలా అన్నాడు.

"రాజా! నీవు అయోధ్యానగరానికి వెళ్లు. సంతానం కోసం "పుత్రకామేష్టి" అనే యాగం నిర్వహించు. ఆ యజ్ఞనిర్వహణవల్ల నాకు సాటి రాగల నలుగురు పుత్రులు నీకు కలుగుతారు" వెంటనే బయలుదేరు. అభీష్ట సిద్ధిరస్తు! అని దశరథుణ్ణి సాగనంపాడు.

**విష్ణువే శ్రీరాముడు**

ఆ తర్వాత విష్ణుభగవానుడు అక్కడవున్న దేవతలతో ఇలా అన్నాడు. నేను దశరథునికి పుత్రునిగా శ్రీరాముడనే పేరుతో పుత్రునిగా అవతరించి రావణ కుంభకర్ణులతో పాటు అనేక రక్కసి మూకలను సంహరిస్తాను.

రావణ కుంభకర్ణులకు మానవులవల్ల మాత్రమే మరణం తథ్యం. అందువల్ల పురుషోత్తముడైన మానవునిగా అవతరించి వారిని సంహరిస్తాను. నిశ్చింతగా మీ మీ లోకాలకు వెళ్లండి. అంటూ స్వామి అదృశ్యమయ్యాడు.

పుత్రకామేష్టి యాగం చేసిన దశరథ మహారాజుకు నలుగురు కొడుకులు పుట్టారు. సాక్షాత్తు



శ్రీమన్నారాయణుడు శ్రీరామునిగా, ఆదిశేషుని అంశతో లక్ష్మణుడు, శంఖ, చక్రాంశలతో భరత శత్రుఘ్నులు అవతరించారు.

సాక్షాత్తు వేంకటాచలపతి ఇచ్చిన వరం వల్లే శ్రీరాముడు అవతరించాడని శ్రీవేంకటాచలమాహాత్మ్యం స్పష్టం చేస్తోంది. అంతేగాక ఆ రాముడే నేను, నేను ఆ రాముణ్ణి అంటూ వేంకటేశ్వరుడు అడుగడుగునా స్ఫురింపజేస్తూనే ఉన్నాడు.

ప్రతిరోజు తిరుమల క్షేత్రంలో శ్రీనివాస భగవానుడు ఉదయంపూట సుప్రభాతంలో

**కౌసల్యా సుప్రజారామ! పూర్వాసంధ్యా ప్రవర్తతే**
**ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవమాహ్నికమ్**

అంటూ శ్రీరామచంద్రుని పేరుతో మేల్కొల్పులు పాడించు కొంటున్నాడు.

త్రేతాయుగంలో జటధారులైన శ్రీరామలక్ష్మణులు అరణ్యవాస సమయంలో సీతాన్వేషణ చేస్తూ ఈ



వేంకటాచలక్షేత్రానికి వచ్చారు. అందుకు గుర్తుగా శ్రీ సీతారామలక్ష్మణస్వాములవారి విగ్రహ మూర్తులు తిరుమల శ్రీవారిఆలయంలో కొలువై వున్నాయి. కనుకనే ఈ శ్రీ సీతారామలక్ష్మణుల విగ్రహమూర్తులు కిరీటాలు లేకుండా కేవలం జటధారులుగానే దర్శన మిస్తుండడం విశేషం!

**జాంబవంత - జనమేజయుల ప్రతిష్ఠ**

సీతాన్వేషణసమయంలో రామలక్ష్మణులతో పాటు జాంబవంత, హనుమదాదులు కూడా వేంకటాచలంలో సంచరించినట్లుగా పురాణ కథనం. ఆ సమయంలో జాంబవంతుడు కొన్నిచోట్ల సాక్షాత్తు మహావిష్ణువు అయిన శ్రీరాముని విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు ప్రతీతి! అటు శ్రీరామావతారంతోను, కృష్ణావతారం తోను ప్రత్యక్షంగా అనుబంధం వున్న భక్తాగ్రేసరుడు జాంబవంతుడు.

శ్రీరాముడు నడయాడిన దివ్యప్రదేశంలో జాంబవంతుని వల్ల ప్రతిష్ఠింప బడిన విగ్రహమూర్తులే తిరుపతి పట్టణం నడిబొడ్డున వెలసిన శ్రీ



సీతారామలక్ష్మణుల మూర్తులు, అని అనూచానంగా వినవస్తున్న ఐతిహ్యం!

ఆ తర్వాత, కాలాంతరంలో, ద్వాపరయుగాంతంలో జనమేజయచక్రవర్తి ఈ ఆలయాన్ని పునరుద్ధరించి పునః ప్రతిష్ఠించాడని కూడ పెద్దలమాట!

**శ్రీకోదండరామస్వామి ఆలయం**

నిరంతరం తిరుమల యాత్రికుల సందడితో అటూ ఇటూ సంచరించే వాహనాల రణగొణ ధ్వనుల మధ్యలో వెలుగొందుతుంటుంది తిరుపతి పట్టణం. ఆ పట్టణం నడిబొడ్డున నిత్యమూ గంభీరమైన ప్రశాంత వాతావరణంతో ఆధ్యాత్మిక చైతన్యంతో విరాజిల్లుతున్న ఆలయం శ్రీకోదండ రామస్వామి ఆలయం.

ఏడు బంగారుకలశాలు మిలమిల మెరుస్తున్న మహాద్వార రాజగోపురంతో పశ్చిమాభిముఖంగా దివ్యమైన ప్రశాంత ధామంగా యాత్రికులకు గోచరిస్తుంటుంది శ్రీకోదండరామస్వామి ఆలయం.

13

వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం సంప్రదాయబద్ధంగా అర్చనలు, ఉత్సవాలు జరుగుతున్న తిరుపతి శ్రీకోదండరామస్వామి ఆలయంలోని విశేషాలను తెలుసుకుందాం.

## మహాద్వార రాజగోపురం

మహాద్వార రాజగోపురం సుమారు 10-12 అడుగులు ఎత్తైన రాతి అధిష్ఠానంపై మట్టి ఇటుకలతో మూడు అంతస్థులుగా అనేక శిల్పాలతో నిర్మింపబడివుంది. గోపురంపైన ఏడు బంగారు కలశాలు తళతళమెరుస్తూ ఆలయవైభవాన్ని చాటుతున్నట్లుగా వుంటుంది.

ఈ రాజగోపురం అనుసంధానిస్తూ ఎత్తైన కోట గోడవలె గండశిలలతో నిర్మితమైన దీర్ఘచతురస్రాకార ప్రాంగణం మధ్యలో ఎదురుగా శ్రీకోదండరాముని ప్రధాన ఆలయం నిర్మింపబడింది. ఆలయం ఎదురుగా బంగారు బలిపీఠం, ధ్వజస్తంభం, వాయువ్యమూలలో కల్యాణ మండపం, ఆలయంచుట్టూరా ప్రాకారానికి ఆనుకొని

14

చక్కని ఉద్యానవనం, ఆగ్నేయమూలలో వంటశాల, నైరుతిమూలలో అశ్వత్థనారాయణ వృక్షాలతో వున్న వేదిక అలరారుతూ వున్నాయి.

## బలిపీఠం - ధ్వజస్తంభం

రాజగోపుర ద్వారంలో ప్రవేశించిన వెంటనే ఎదురుగా బంగారు బలిపీఠం – దాన్ని ఆనుకొని చాల ఎత్తైన బంగారు ధ్వజస్తంభం కనిపిస్తాయి. బ్రహ్మోత్సవాల సమయంలో ఈ ధ్వజస్తంభంపై గరుడ పతాకం ఎగురవేయ బడుతుంది. ప్రతిరోజూ నివేదన జరిగే వేళల్లో ఈ బలిపీఠంపై భూతగణాలకు శుద్ధాన్నం బలిగా సమర్పించ బడుతుంది.

## వంటశాల

ఆలయ ప్రదక్షిణమార్గంలో ఆగ్నేయమూలన వంటశాల ఉంది. ఇందులో ఆలయంలో జరిగే మూడు పూటల నివేదనలకు అవసరమయ్యే అన్నప్రసాదాలు, అప్పాలు, దోసెలు, సుండలు, పోళీలు, సుఖియలు, తయారు చేయబడతాయి.

15

## ఊంజల్ మండపం

ప్రధాన ఆలయ ప్రాంగణంలో నైరుతిమూలన తూర్పు ముఖంగా నాలుగు కాళ్ల ఎత్తైన శిలామండపం ఉంది. ఈ మండపంపైన బంగారుకలశ గోపురం ఉంది. బ్రహ్మోత్సవంలో ప్రతిరోజు సాయంత్రం ఈ మండపంలో ఊంజలసేవ జరుగుతుంది. అంతేగాక శ్రీరామనవమి నాడు, మరునాడు దశమిరోజున శ్రీసీతారామ కల్యాణం, శ్రీరామపట్టాభిషేక ఉత్సవాలు ఈ మండపంలో నిర్వహింపబడతాయి.

## ప్రధాన ఆలయం

ప్రధాన ఆలయంలో ప్రవేశించేముందుగా ప్రధాన ఆలయాన్ని ముఖమండపం, అర్థమండపం, అంతరాళం, గర్భాలయం అని నాలుగు భాగాలుగా వింగడించి వాటిని గూర్చి తెలుసుకొంటూ ముందుకు సాగుదాం.

## ముఖమండపం

వరుసకు 5 స్తంభాల వంతున 6 వరుసలున్న శిల్పశోభితమైన శిలా స్తంభాలతో నిర్మితమైన

16

ముఖమండపం మధ్య భాగాన ఒక అరుగులాంటి వేదిక నిర్మింపబడింది. ఈ వేదికపై సాధారణ రోజుల్లో స్నపన తిరుమంజనాదులు, ఊంజల్ సేవలు జరుపబడుతుంటాయి. ముఖమండపానికి పడమటి దిక్కున ఇనుప కటాంజనం నిర్మింపబడింది. ఈ ముఖమండపంలోనే శ్రీకోదండ రామస్వామికి ఎదురుగా, గరుడాళ్వారుమండపం ఉంది. శ్రీరామునికి ఎదురుగా గరుడ మండపం ఉండడం ఎక్కడా కనపడదు. ఇచటి రాముడు సాక్షాత్తు విష్ణువని అర్థం. ముఖమండపంలోనే ఈశాన్యమూలన రెండు నైవేద్య ఘంటలు వున్నాయి. నివేదన సమయంలో ఈ ఘంటలు మ్రోగింప బడతాయి. ఈ ముఖమండపంలో గరుడాళ్వారుకు ముందుభాగంలో 'కౌసల్యాసుప్రజారామ...' అంటూ సుప్రభాతం పఠింపబడుతుంది.

## విష్వక్సేనులవారి సన్నిధి

ముఖమండపం దాటితే ఉన్న అర్థమండపంలోనే ఉత్తరం వైపున దక్షిణాభిముఖంగా శ్రీస్వామివారి

సైన్యాధికారి విష్వక్సేనులవారి శిలావిగ్రహం వున్న 'అర' ఉంది. ఇందులో 4 అడుగులు ఎత్తువున్న విష్వక్సేనులవారి శిలాప్రతిమతోపాటు, పంచలోహ ఉత్సవమూర్తి కూడా ఉన్నాయి.

## భాష్యకారులవారి సన్నిధి

ఇదే అర్ధమండపంలోనే దక్షిణంవారకు వున్న రాతిఅరలో (గది) భగవద్రామానుజుల వారి శిలా విగ్రహం ప్రతిష్ఠించబడింది. చిన్ముద్ర ధరించి వున్న రామానుజులవిగ్రహంతోపాటు, నమ్మాళ్వారుల మరియు రామానుజుల చిన్నపాటి పంచలోహ మూర్తులు కూడ ఇక్కడ దర్శించవచ్చు.

ఈఅర్ధమండపంలో మధ్యభాగాన, సుమారు 4 అడుగుల ఎత్తైన దీర్ఘచతురస్రాకారపు రాతి అధిష్టానంపైన అంతరాళం, గర్భాలయం నిర్మింపబడినాయి. మెట్లు ఎక్కి లోన ప్రవేశించే ద్వారానికి ఇరువైపులా కాపలా కాస్తున్న జయవిజయుల నిలువెత్తు శిలావిగ్రహమూర్తులు నయన మనోహరంగా దర్శనమిస్తాయి.



## అంతరాళం

నాలుగుమెట్లు ఎక్కి ఈ ప్రవేశ ద్వారందాటి లోనికి వెళితే అంతరాళం ఉంది. ఈ అంతరాళం నుండే గర్భాలయంలోని మూలమూర్తులను భక్తులు దర్శిస్తారు. ప్రతిరోజు ఈ అంతరాళంలోనే గొలుసులతో వేలాడదీయబడిన తూగుటుయ్యాలలో వెన్నముద్ద కృష్ణునికి ప్రతిరోజు రాత్రి ఏకాంతసేవ అనగా పవళింపుసేవ జరుపబడుతుంది.

## గర్భాలయం

అంతరాళం దాటితే లోన ఉండేదే గర్భాలయం. గర్భాలయం మధ్యభాగాన 2 అడుగుల ఎత్తైన శిలా పీఠంపైన స్థానక భంగిమ (నిలుచున్న) లో ప్రతిష్ఠింపబడిన శ్రీ సీతా లక్ష్మణసమేత శ్రీ కోదండరామస్వామివారి నిలువెత్తు శిలావిగ్రహమూర్తులు ప్రతిష్ఠించడినాయి. కొన్ని పంచలోహ మూర్తులు కూడా ఈ గర్భాలయంలో ఉన్నాయి.



## శ్రీకోదండరామస్వామి (మూలమూర్తులు)

ధనుర్బాణాలను ధరించి మధ్యలో నిలిచి వున్న శ్రీరామచంద్ర స్వామికి కుడివైపున సీతమ్మవారు, ఎడమవైపున ధనుర్బాణాలు ధరించి నిలిచివున్న లక్ష్మణస్వామివారి శిలావిగ్రహాలు ప్రతిష్ఠించబడినాయి. హనుమంతుని శిలామూర్తి గర్భాలయంలో లేకపోవడం విశేషంగా గమనించవలసిన అంశం.

మూలమూర్తి అయిన శ్రీకోదండరామస్వామి నొసటన తెల్లని ఊర్ధ్వపుండ్రాలు ధరించి, చిన్మయహాసంతో తిరుమల శ్రీనివాస భగవానుని మూలమూర్తిని తలపిస్తుంటాడు. సాక్షాత్తు శ్రీనివాసుడే ధనుర్బాణాలతో ఇలా నిలబడ్డాడా అనిపిస్తుంది.

కుడివైపున సీతాదేవితోను, ఎడమవైపున లక్ష్మణునితో వున్న శ్రీ కోదండరామస్వామివారి మూలమూర్తులను జాంబవంతుడు ప్రతిష్ఠించినాడని, అనూచానంగా వినవస్తున్న మాట. శ్రీరాముడనగా సాక్షాత్తు



శ్రీమన్నారాయణుడే అని భావించిన జాంబవంతుడు శ్రీరామునికి ఎదురుగా గరుడున్ని మాత్రమే ప్రతిష్ఠించాడు. ఇంతేగాక జాంబవంతునితో తిరిగిన 'హనుమ' సుగ్రీవుని మంత్రిమాత్రమే. అందువల్ల జాంబవంతుని ప్రతిష్ఠలో 'హనుమంతుడు' చోటు చేసుకోలేదని భావించవచ్చు.

మూలమూర్తులకు ప్రతిరోజు ఉదయం 5 గంటలకు సుప్రభాతం – తదుపరి విశ్వరూపదర్శనం ఆ తర్వాత తోమాలసేవ, సహస్రనామార్చన, మొదటి గంట నైవేద్యం – మధ్యాహ్నం అష్టోత్తర శతనామార్చనతో రెండవ నివేదన, సాయంత్రం తోమాలసేవ, అష్టోత్తర శతనామార్చనతో మూడవ నివేదన జరుగుతాయి.

ప్రతి శనివారం ఉదయం మూలమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాదులతో అభిషేకం జరుగుతుంది.

ప్రతి అమావాస్య నాడు శ్రీకోదండరామస్వామి వారి మూలమూర్తులు పూలంగిసేవలో దర్శనమిస్తారు.

21

## ఉత్సవమూర్తులు

గర్భాలయంలో మూలమూర్తులతో పాటు శ్రీకోదండరామ స్వామివారి పంచలోహఉత్సవమూర్తులు, భక్తాంజనేయస్వామి పంచ లోహమూర్తి, వెన్నముద్ద కృష్ణుని పంచలోహవిగ్రహమూర్తి, సుదర్శన భగవానుని (చక్రత్తాళ్వార్) పంచలోహవిగ్రహమూర్తి చోటుచేసుకున్నాయి.

గర్భాలయం వెలుపల తరచుగా శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామ స్వామి ఉత్సవమూర్తులు బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవం, ఊరేగింపుల్లో పాల్గొంటారు. చక్రత్తాళ్వార్ బ్రహ్మోత్సవంలో మాత్రమే బయటకు వచ్చి చక్రస్నానంలో పాల్గొంటారు. ఈ చక్రస్నానం ఆళ్వారుతీర్థం అనబడే కపిలతీర్థంలో నిర్వహిస్తారు. అంతేగాక ప్రతి పున్నమినాడు కల్యాణమండపంలో జరిగే శత కలశాభిషేకంలో కూడ సుదర్శనుడు పాల్గొంటాడు.

శ్రీరామనవమి సందర్భంగా జరిగే పట్టాభిషేకోత్సవంలో పాల్గొనడానికి మాత్రమే ఆంజనేయుని పంచలోహ ప్రతిమ బయటకి తేబడుతుంది.

22

## శ్రీ భక్తాంజనేయస్వామిగుడి

శ్రీకోదండరామస్వామివారి ఆలయానికి ఎదురుగా వున్న వీధిని సన్నిధివీధి అంటారు. ఈ సన్నిధి వీధిలో రాములవారికి అభిముఖంగా అనగా తూర్పుముఖంగా శ్రీభక్తాంజనేయస్వామి ఆలయముంది. ఇందులో నిలువెత్తు హనుమంతుడు నమస్కారభంగిమలో దివ్య దర్శనమిస్తాడు. ఈ స్వామివారికి ప్రతి ఆదివారం ఉదయంపూట పంచామృతంతో అభిషేకం నివేదనలు ఘనంగా జరుగుతాయి. ఆంజనేయస్వామి గర్భాలయంపైన ఏక కలశ గోపురం నిర్మింపబడింది.

దేవస్థానంవారి ఆలయం దర్శనం బస్సులవల్లా, ఇటీవల నిర్వహిస్తున్న ఉత్సవాల వల్లా ఇప్పుడిప్పుడే కోదండరామాలయానికి భక్తుల సందడి బాగా పెరిగిందని చెప్పవచ్చు.

ఇలాగ శ్రీకోదండరామస్వామిఆలయం మళ్లీ ఇటీవలి కాలంలో పూర్వవైభవాన్ని సంతరించుకుంటూ, భక్తుల సందడితో కోలాహలంగా ఉంటోంది.

23

## నిత్యోత్సవాలు

ప్రతిరోజు విధిగా జరుపబడే సేవలను, ఉత్సవాలను నిత్యోత్సవాలు అని అంటారు.

ప్రతిరోజు శ్రీకోదండరామస్వామివారి ఆలయం తెల్లవారు జామున **'సుప్రభాతం'** అనే మేల్కొలుపు సేవతో ప్రారంభమై రాత్రి **"ఏకాంతసేవ"** అనే పవళింపు సేవతో ముగుస్తుంది. **సుప్రభాతం** తర్వాత **విశ్వరూపదర్శనం, తోమాలసేవ, సహస్రనామార్చన, అర్చనానంతరదర్శనం** మూడుపూటల **నివేదనలు** రాత్రి **ఏకాంతసేవ** ఇవి నిత్యోత్సవాలు.

## వారోత్సవాలు

వారానికి ఒకసారి నిర్ణీతరోజున జరుపబడే ఉత్సవాలను వారోత్సవాలు అంటారు.

ప్రతి శనివారం ఉదయం శ్రీ కోదండరామస్వామివారి మూలమూలర్తులకు **అభిషేకం,** ఆ తర్వాత **అభిషేకానంతరదర్శనం,** ఆ రోజు సాయంత్రం ఊరేగింపు పిదప ఊంజల్‌సేవ జరుగుతుంది.

24

## మాసోత్సవాలు

నెలలో ఒక్కమారు నిర్ణీత రోజున లేదా నిర్ణీత నక్షత్రం రోజున జరుపబడే ఉత్సవాలు ఇవి.

ప్రతినెలా శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసునాటి ఉదయం శ్రీ సీతారామచంద్రస్వామికి **కల్యాణోత్సవం** ఆ సాయంత్రం **ఊరేగింపు** అలాగే ప్రతినెలా పున్నమినాడు ఉదయం **శతకలశాభిషేకం** ఆనాటి సాయంత్రం రామచంద్రపుష్కరణి తోటలో **ఆస్థానం,** ఊరేగింపు జరుగుతుంది.

ప్రతినెలా అమావాస్యనాటి ఉదయం 8గం॥ నుండి రాత్రి ఏకాంతసేవవరకు శ్రీ కోదండరామస్వామివారి మూలమూర్తులకు **"పూలంగిసేవ"** జరుగుతుంది.

## వార్షికోత్సవాలు

సంవత్సరానికి ఒకమారు నిర్ణీత రోజుల్లో జరిగే ఉత్సవాలను వార్షికోత్సవాలని, సంవత్సరోత్సవాలని అంటారు.

**1. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం:** దేవాలయాన్ని పూర్తిగా శుద్ధి చేయడమనే కార్యక్రమాన్ని కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అంటారు. దీపావళికి ముందుగాను, బ్రహ్మోత్సవాలకు ముందుగాను ఇలా సంవత్సరంలో రెండుమార్లు తిరుమంజనం నిర్వహింపబడుతుంది.

**2. బ్రహ్మోత్సవాలు:** ప్రతి ఏటా పాల్గుణమాసంలో మృగశిరనక్షత్రంనాటికి పూర్తి అయ్యేట్లుగా 9 రోజుల ముందు నుంచి శ్రీకోదండరామస్వామికి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి.

ముందునాటి సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం జరుగుతుంది. మొదటిరోజున ఉదయం బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తూ ధ్వజస్తంభంపై 'గరుడ కేతనం' ఎగురవేస్తారు. ఆ రోజు రాత్రి పెదశేషవాహనం, ఆ తర్వాత రెండవనాటినుంచి సుమారు 8 రోజులపాటు శ్రీ కోదండరామునికి ఉదయం, సాయంత్రం వివిధ వాహనాలపై ఊరేగింపులు వైభవంగా జరుగుతవి. చివరిరోజున అనగా మృగశిర నక్షత్రం నాటి ఉదయం



పూట శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామివారితో పాటు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ ఊరేగింపుగా ఆళ్వార్ తీర్థానికి (కపిలతీర్థం) వెళతారు. అక్కడ స్నపన తిరుమంజనం అయిన తర్వాత పుష్కరిణిలో చక్రస్నానం జరుపబడుతుంది.

**3. రేపాకుల సుబ్బమ్మతోట ఉత్సవం (ఆర్.ఎస్. గార్డెన్):** సుమారు 100 ఏండ్లకు ముందు రేపాకుల సుబ్బమ్మ అనే భక్తురాలు శ్రీకోదండరామస్వామి వారికి, ఇప్పటి బాలమందిరం, ఓరియంటల్ కాలేజి, శ్రీగోవిందరాజ స్వామి హైస్కూలు వ్యాపించిన తోటస్థలాన్ని విరాళంగా సమర్పించింది. అందుకు అనుగ్రహంగా బ్రహ్మోత్సవానంతరం రేపాకుల సుబ్బమ్మగారి తోటలో వుండే మండపానికి శ్రీసీతాలక్ష్మణసమేత శ్రీకోదండరామస్వామి ఊరేగింపుగా వస్తారు. అక్కడ అభిషేక, అర్చనలు, నివేదనలు జరిగినతరువాత స్వామివారు ఆలయం చేరుకుంటారు.

**4. కనిజతోట ఉత్సవం:** రేపాకుల సుబ్బమ్మతోట ఉత్సవం జరిగిన మరునాడే కనిజతోట ఉత్సవం జరుగుతుంది.



పూర్వం గోవిందరాజస్వామివారి ఆలయం వెనుక పాతహుజూర్ ఆఫీసులో వుండే దిగుడు బావిలో శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామివారికి స్నపన తిరుమంజనం జరిగేది. అందుకు గుర్తుగా ఆ సాయంత్రం గోవిందరాజస్వామివారి ఆలయ ప్రదక్షిణంగా ఊరేగింపు జరిగిన తర్వాత శ్రీకోదండరామస్వామి ఆలయం చేరుకొంటారు.

**5. తెప్పోత్సవాలు:** ప్రతి సంవత్సరం చైత్రమాసం పున్నమికి పూర్తి అయ్యేట్లుగౌ శ్రీరామచంద్ర పుష్కరిణిలో మూడురోజులపాటు, ఇంతేగాక మాఘపున్నమికి పూర్తి అయ్యేట్లుగా శ్రీగోవిందరాజ స్వామివారి పుష్కరిణిలో 5 రోజులపాటు జరిగే తెప్పోత్సవాల్లో మొదటిరోజు శ్రీ కోదండరామస్వామికి తెప్పోత్సవాలు జరుగుతాయి.

**6. హనుమజ్జయంతి:** ప్రతి ఏటా వైశాఖ బహుళ దశమినాడు శ్రీ కోదండరామస్వామివారు ఎదురుగా వున్న ఆంజనేయస్వామి గుడికి రాగా 'హనుమజ్జయంతి' వేడుకలు జరుగుతవి.



**7. పవిత్రోత్సవం:** ఆలయంలో తెలిసీ, తెలియక జరిగే దోషాల పరిహరణార్థం ప్రతి సంవత్సరం ఆషాఢ బహుళ త్రయోదశికి పూర్తి అగునట్లుగా 3 రోజులపాటు పవిత్రోత్సవాలు జరుగుతవి.

**8. ధనుర్మాసం:** ప్రతిసంవత్సరం డిశంబరు 15 నుండి జనవరి 14 వరకు ధనుర్మాసంలో నెల రోజులపాటు సుప్రభాతం వుండదు. తెల్లవారుజామున 4 గంటలకు పొంగళ్లు నివేదింపబడతాయి. ధనుర్మాసంలోనే వైకుంఠ ఏకాదశి పూజలు జరుగుతవి.

**9. కూపు రామచంద్రపేట ఉత్సవం:** ప్రతి సంవత్సరం మాఘ పున్నమినాటి ఉదయం శ్రీసీతాలక్ష్మణసమేత శ్రీకోదండరామ స్వామివారు తిరుపతికి దక్షిణంగా ఉన్న కూపురామచంద్రపేట సువర్ణముఖీతీరంలో అభిషేక అర్చనలు చేసుకొని, సాయంత్రం ఆలయం చేరుకొంటారు.

***శ్రీరామ! జయ రామ! జయ జయ రామ!!***